కరెంట్ కష్టాలకు పరిష్కారం

- వెల్టూరులో సబ్‌స్టేషన్ నిర్మాణం
- నాలుగు గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్యకు చెక్


వెల్టూరులో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్

చిన్నంబావి: మండలంలోని వెల్టూరు, చిన్నమారు, అయ్యవారిపల్లి, కాలూరు, చెల్లపాడు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న కరెంట్ కష్టాలు ఇక తీరినట్టే. ఆకాశంలో మేఘం మెరిసినా.. ఉరుములు ఉరిమినా పోయే కరెంట్ మళ్లీ ఎప్పుడు వస్తదో తెలియక పడిన ఇబ్బందులకు ఇక చెక్ పడినట్టే. దాదాపు పుష్కరకాలంగా ఎదురు చూస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఎట్టకేలకు వెల్టూరు గ్రామంలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

రూ.2కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం

వెల్టూరు గ్రామంలో 33/11కేవీ నూతన సబ్ స్టేషన్‌ను రూ.2కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేశారు. 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లో ఓల్టేజీ సమస్యకు చెక్ పెట్టనున్నారు. పెద్దదగడ సబ్‌స్టేషన్ నుంచి వెల్టూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌కు ప్రత్యేక ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఈ సబ్ స్టేషన్ ఏర్పాటుతో వెల్టూరు, చెల్లపాడు, అయ్యవారిపల్లి, చిన్నమారు, కాలూరు గ్రామాల వ్యవసాయబావులకు, గృహవిద్యుత్ వినియోగదారులకు నిరంతర కరెంట్ సరఫరా జరగనుంది.

ఏళ్ల సమస్యకు పరిష్కారం..



ఎన్నో ఏళ్లుగా సమస్యకు పరిష్కారంతో చెక్ పడనుంది. శ్రీశైలం ప్రాజెక్టులో సర్వం కోల్పోయి రాష్ట్రానికి వెలుగులు నింపాం కానీ మాకు మాత్రం చీకట్లే మిగిలాయి. మాకు కరెంట్ సమస్య ఉంది. చాలా ఏళ్లుగా పోరాడుతున్నాం. సబ్ స్టేషన్ నిర్మాణంతో ఇబ్బందులు తొలిగాయి.

– లక్ష్మీనారాయణ, వెల్టూరు

లో ఓల్టేజీకి చెక్..



మా గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణంతో లో ఓల్టేజీ సమస్యకు చెక్ పడనుంది. బావుల దగ్గర లోఓల్టేజీ కారణంగా బోరు మోటార్లు కాలిపోయి చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ సమస్యకు పరిష్కారం లభించింది.

– మద్దిలేటి, వెల్టూరు

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



వీపనగండ్ల: మండలంలోని రంగవరం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన చెక్కులను గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. మాధవికి రూ.25వేలు మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో అందించినట్లు పార్టీ సీనియర్ నాయకులు బుచ్చన్న సాగర్, వేముల తిరుపతయ్య, రాజవర్ధన్‌రెడ్డి, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు మంజూరు చేయాలని ధర్మసమాజ్ పార్టీ నియోజకవర్గ నాయకురాలు ఆది సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు సూచించిన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ అర్హులైన పేదలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులను విస్మరిస్తే పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

వృథాగా భగీరథ నీరు



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల గ్రామంలో క్రీడా ప్రాంగణం దగ్గర భగీరథ నీటి పైపు లీకై నీరు వృథాగా పోతోంది. పైపులు లీకవడంతో నీరు కలుషిత మవుతూ వృథాగా ప్రవహిస్తోంది. నీరు వృథాగా పోవడంతో రోడ్డు పొడవునా బురద మయంగా మారింది. అధికారులు స్పందించి లీకేజీ మరమ్మతు చేయించాలని ప్రజలు కోరారు.

ఆలయాల నిర్మాణానికి పూజలు



ఆత్మకూర్: గ్రామ దేవతల ఆలయాలకు పూర్వ వైభోవం తీసుకొచ్చేందుకు భక్తులు సంకల్పించారు. ఆదివారం ఆత్మకూర్‌లోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద కడప ప్రతిష్ఠలో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛరనల మధ్య హోమం, కలశాల ఊరేగింపు నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఆలయంతో పాటు పోచమ్మ, లింగమయ్య, భూ లక్ష్మమ్మ, కట్టమైసమ్మ, కర్రెమ్మ కోట మైసమ్మ గ్రామ దేవతలకు నూతన ఆలయాల నిర్మాణాలకు కలపాకర్షణ ఆవాహనం మహోత్సవ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



ఆత్మకూర్: వాసవీ క్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీరామ ట్రేడర్స్ వద్ద వాసవీ క్లబ్, వనితాక్లబ్ అధ్యక్షులు ఎలిశెట్టి గాయత్రి, రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి సూరంపల్లి శ్రీవిద్య, భరత్, ఏపూరి విజయలక్ష్మి యాదగిరిశెట్టి, యశ్వంత్, గాయత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు. సంత ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణికులు వస్తుంటారని, చల్లని నీటితోపాటు మజ్జిగను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్, వనితాక్లబ్ నిర్వహకులు పాల్గొన్నారు.

'ఉపాధి' పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

ఆత్మకూర్: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. ఆదివారం స్థానిక వర్తక సంఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు రాజు జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీలో మేట్లను ఫీల్డ్‌అసిస్టెంట్లుగా గుర్తించాలని, ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అంజనేయులు, కార్మికులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–91 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని కెఎస్ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు దామోదర్‌రెడ్డి, శివన్న, సూర్యనారాయణ, విజయలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మాందాపూర్‌లో..

మాందాపూర్ ఉన్నత పాఠశాలలో 2005–06 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. దాదాపుగా 20 ఏళ్ల తర్వాత నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు జగదీశ్వర్‌రెడ్డి, మంజుల, మేగారెడ్డి, ప్రసాద్‌రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆనాటి గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నారాయణ, ఖాజామైనుద్దీన్, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులకోసం పోరాటం



ఆత్మకూర్: కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆత్మకూర్ మండలంలోని మూలమల్ల, కత్తేపల్లి గ్రామాల్లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్, టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికులు ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా నాయకులు ప్రసాద్, వెంకటన్న మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని, అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు సమరశిల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో షఢక్, కృపాదానం, శేఖర్, రవి, కురుమూర్తి, బుచ్చన్న, నాగేష్, సుభాష్, కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



వీపనగండ్ల: మండలంలోని తూంకుంట వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్‌బీ కానిస్టేబుల్ పరశురాముడు తెలిపారు. తూంకుంట గ్రామానికి చెందిన కోళ్ల శేఖర్ యాదవ్ ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రాగా, ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

షాపురంలో పశువుల చోరీ

ఖిల్లాఘనపురం: పశువుల పాకలో కట్టేసిన ఎద్దులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన సంఘటన ఖిల్లాఘనపురం మండలం షాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. షాపురం గ్రామానికి చెందిన మామిళ్ల మాసయ్యతో పాటుగా వారి పాలివాల్లు అందరు కలిసి గ్రామం నుంచి కర్నెతండాకు వెళ్లే రోడ్డు పక్కల ఉన్న తమ వ్యవసాయ పొలాల్లో పశువుల పాకలో ఎద్దులను కట్టేశారు. రాత్రి అందరు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. ఆదివారం తెల్లవారు జామున ప్రతి రోజు మాదిరిగా పశువుల పాక దగ్గరకు వెళ్లారు. అక్కడ మొత్తం 8 ఎద్దులు, ఒక ఆవు కనిపించలేదు. చుట్టు పక్కల ఎక్కడ వెతికినా కనిపించలేదు. పశువుల పాక దగ్గరకు బొలెరో వాహనాలు వచ్చినట్లు జాడలు కనిపించాయి. ఎవరో ఎద్దులను దొంగిలించారని తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడు తెలిపారు.

ముగిసిన శ్రీనివాసస్వామి స్వర్ణోత్సవాలు


ఆలయ ఆవరణలో పూజలు నిర్వహిస్తున్న పండితులు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు..

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ శ్రీ భూ శ్రీనివాసస్వామి ఆలయంలో జరుగుతున్న స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. వారం రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించగా చివరిరోజు ఆదివారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భగవత సప్తాహం, సంగీత కచేరి, ఆధ్యాత్మిక ధార్మిక ప్రసంగాలు కొనసాగాయి. ఈ సందర్భంగా బిద్వాన్ తుప్పనక్కిరి ప్రహల్లాదచార్యులు మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి అన్నారు. భక్తి భావంతోనే మోక్షానికి మార్గం సిద్ధిస్తుందన్నారు. శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని వివరించారు. హంపీ క్షేత్ర పీఠాధిపతులు గోవింద తీర్థుల స్వామి అవబృత సంక్షోప్రాణం చేశారు. కార్యక్రమంలో శక్తి పీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్, సేవా సమితి సభ్యులు సీతారామారావు, జనార్దన్‌రావు, ప్రభంజన్ రావు, భీమ్‌సేన్ చారి, హన్మేష్, ప్రకాష్ శేషు పాల్గొన్నారు.

దత్తలింగేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన


దత్తలింగేశ్వరస్వామి ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న భక్తులు

మరికల్: మండల కేంద్రంలోని దత్తనగర్‌లో నిర్మించిన నూతన ఆలయంలో ఆదివారం ఘనంగా దత్త లింగేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ప్రత్యే క పూజల అనంతరం మూడో రోజు దత్త లింగేశ్వర స్వామి, కాలబైరవుడు, అభయాంజనేయస్వామి, నవగ్రహాలు, నాగదేవతల విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభం విగ్రహ ప్రతిష్ఠించారు. తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలు

దామరగిద్ద: మండలంలోని ఉడ్మల్‌గిద్దలో ఆదివారం బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నాల్గు ప్రధాన కూడళ్ల బొడ్రాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. గ్రామ ఆడపడుచులు పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. గ్రామ చెక్కభజన మండలి జానపద ప్రదర్శన ఎంతగానో ఆ కట్టుకుంది.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యు వతీ యువకులు, ఆడపడుచులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి


మర్రికుంటలోని భగీరథ మహర్షి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సగర సంఘం నాయకులు

వనపర్తిటౌన్: మహర్షి ముని శాపంతో 60వేల మంది సగరులు భస్మంగ మారిపోతే భగీరథ మహర్షి తపస్సు చేసి గంగను దివి నుంచి భువికి నీరుగా తీసుకొచ్చి శివుడు శిరస్సుపై నుంచి వంశస్తులపై పారించడంతోనే ఆ సగరులు శాపవిమోచనం పొందారని రాష్ట్ర సగర సంఘం ఉపాధ్యక్షులు చిలుక సత్యం సాగర్ గుర్తు చేశారు. ఆదివారం సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని మర్రికుంట, కొత్తకోట రోడ్డులోని భగీరథుడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో భగీరథ మహర్షి జయంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుక సత్యం సాగర్, పట్టణ అధ్యక్షుడు చీర్ల గోవర్ధన్, నాయకులు చీర్ల ఆంజనేయులు, చీర్ల రాజు, సత్యనారాయణ, చీర్ల విష్ణు, చీర్ల జనార్దన్, రావుల వెంకటేష్, పోతులపల్లి రాజు, చిలుక బాలస్వామి, చంద్రాయుడు, నాగేంద్రం, మహేష్, చీర్ల రాజు, శివసాగర్, యాదగిరి సాగర్, మహనీయుల స్ఫూర్తి వేదిక నాయకులు, కవులు గిరిరాజాచారి, గంధం నాగరాజు, శ్రీనివాసరావు, బాలేమియా పాల్గొన్నారు.

ఎంపీ అరుణ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ డీకే అరుణ జన్మదిన వేడుకల సందర్భంగా అమరచింత పట్టణానికి చెందిన చిన్నారులు ఎంపీని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీకి వినూత్నంగా చిన్నారులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడంతో వారికి పలకలు, నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేర్వరాజు, మేర్వఅనిల్, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ఆత్మకూర్: ఎంపీ డీకే అరుణ జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్, నాయకులు అనీల్‌గౌడ్, రేచింతశ్రీను, విష్ణువర్ధన్‌రెడ్డి, రాము, మాసన్న, రాజు, రవి, నీలారెడ్డి, సాయి, రామకృష్ణారెడ్డి, బాలరాజు ఉన్నారు.

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ జన్మదిన వేడుకలు జిల్లా అధ్యక్షుడు డీ నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర సహ కోశాధికారి జ్యోతి రమణ, నాయకులు అలివేలమ్మ, సుమిత్రమ్మ, కుమార్, పెద్దిరాజు, రాజశేఖర్, లక్ష్మి, కవిత, జ్ఞానేశ్వర్, నవీన్, రవి కుమార్, రఘు, గోవిందు, అరవింద్ పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు లోకిరేవు వీరభద్రుడు


ఉత్సవాలకు ముస్తాబైన లోకిరేవు వీరభద్రస్వామి దేవాలయం


భద్రకాళి సమేత వీరభద్రస్వామి మూలవిరాట్

- రేపటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

నవాబుపేట: మండలంలోని లోకిరేవులో ఏకశిలతో స్వయంభూగా వెలసి.. ఇక్కడి ప్రజల ఇంటి దేవుడిగా వెలుగొందుతున్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏకశిలతో నిలువెత్తు రూపం లోకిరేవు వీరభద్రుడి ప్రత్యేకత. ఎక్కడ అయినా వీరభద్రుడి విగ్రహం చిన్నగా ఉంటుంది. కానీ లోకిరేవులోని పురాతన దేవాలయంలో మాత్రం ఐదున్నర అడుగుల నిలువెత్తు విగ్రహం ఏకశిలతో ఉండటం.. వీరభద్రుడి తలపై శివలింగం ఉండటం ఇక్కడి విశేషం. కొని దశాబ్దాల క్రితం లోకిరేవు వాగు ఒడ్డుపై వెలసిన స్వామివారు భక్తులతో నిత్య పూజలు అందుకుంటున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తమ ఇలవేల్పుగా భావిస్తారు. ప్రతి ఏడాది మే నెలలో స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం, శకటోత్సవం, అగ్నిగుండ మహోత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. కాగా, అగ్నిగుండ మహోత్సవంలో చాలా మంది శివ భక్తులు అగ్నిలో నడిచి మొక్కులు తీర్చుకుంటారు.

కార్యక్రమాలు ఇలా..

లోకిరేవు వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6న నందికోళ్ల సేవ, 7వ తేదీ తెల్లవారు జామున అగ్నిగుండ మహోత్సవం, సాయంత్రం శకటోత్సవం, పార్వతీ పరమేశ్వరుడి కల్యాణ్యం నిర్వహించనున్నట్లు పూజారులు లింగయ్య, నందీశ్వర్ తెలిపారు. 8న ప్రత్యేక అలంకరణ, 9న మహా మంగళహారతితో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. కాగా, ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఘనంగా శేషదాసుల ఆరాధనోత్సవాలు


ధన్వంతరి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శేషదాసుల 140వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, ధన్వంతరి హోమం నిర్వహించారు. అనంతరం వేదపండితులు రమేషాచారి, ప్రసన్నచారి భక్తులకు ప్రవచనాలు వినిపించారు. భజన మండలి సభ్యులు ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. మల్దకల్ గ్రామానికి చెందిన దాత దామ శంకరయ్య, దామ పార్వతమ్మ రూ.5 లక్షల వ్యయంతో తయారు చేసిన రథాన్ని వితరణ చేశారు. దాతలను ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు, ధీరేంద్రదాస్ సన్మానించారు. కార్యక్రమంలో శశాంక, విష్ణు, అరవిందరావు, ముకుందరావు, మదన్‌మోహన్, వెంకటేశ్వరావు, భీమ్‌సేనాచారి, శ్రీకాంత్ జోషి, రవిచారి, మధుసూదనాచారి, దామ మురళి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంతో రైతుల పడిగాపులు


కడుకుంట్లలో సింగిల్ విండో నిర్వహిస్తున్న కేంద్రంలో రైతుల ధాన్యం నిల్వలు


హీర్ల తండా గోదాం దగ్గర ధాన్యం బస్తాలతో నిలిచిన ట్రాక్టర్లు, లారీలు

సాక్షి, నెట్‌వర్క్: వనపర్తి మండలంలోని కడుకుంట్ల, పెద్దగూడెం గ్రామాలలో ఐకేపీ, సింగిల్ విండో ద్వారా కేంద్రాలను ప్రారంభించారు. ఆ కేంద్రాలల్లో సన్ననకం, దొడ్డురకం ధాన్యం రెండు కొనుగోలు చేస్తున్నారు. కానీ సన్నరకం మాత్రం కాంట వేసిన వెంటనే లారీలలో రైసు మిల్లుకు తరలిస్తున్నారు. దొడ్డు రకం ధాన్యం మాత్రం సేకరించి 8 రోజులుగా లారీలు రాక కేంద్రాలల్లోనే నిల్వ ఉంది. దీంతో కేంద్రంలోనే పడి గాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాలకు పాత గన్నీ బ్యాగులు పంపించడంతో కాంట వేసేటప్పుడు, లారీకి లోడు చేసేటప్పుడు పగిలిపోతున్నాయి. కొత్త గన్నీ బ్యాగులు ఇవ్వాలని వారు కోరారు. సంబంధిత అధికారులు స్పదించి లారీలను ఏర్పాటు చేసి కేంద్రాల నుంచి ధాన్యం తరలించాలని కోరారు.

- ఖిల్లాఘనపురం మండలంలోని హీర్లతండా గ్రామ పంచాయతీలో ఉన్న గోదాం దగ్గర వడ్లు దించుకోవడానికి అవకాశం ఉన్నప్పటికి అధికారులు ముందు నుంచి దించుకోవడానికి అవకాశం ఇవ్వలేదు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర రైస్ మిల్లు, సోళీపురంలోని సింధు రైస్‌మిల్లుకు మాత్రమే ధాన్యం దించుకోవడానికి అనుమతులు ఇవ్వడంతో అక్కడ రోజుల తరబడి నిల్చొని ధాన్యం బస్తాలు దించిన తరువాత రైతులు వెళ్తున్నారు. కొన్ని గ్రామాల నుంచి లారీలు, డీసీఎంల ద్వారా ధాన్యం బస్తాలను గోదాంకు తరలించారు.